Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 236 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :236 | శనివారం 23 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774



## ఆకాశమే హద్దుగా..
## అదే కీలకం

- ఆ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం కీలకమైన విభాగం
- అన్ని అనుబంధ విభాగాలలో కూడా ఈ విభాగం సభ్యులు చురుగ్గా పాల్గొనే అవకాశం ఉంటుంది
- ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడానికి మీకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి

# మేమెలా మద్దతిస్తాం..



- ఉప రాష్ట్రపతి ఎన్నికపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- టీడీపీ ఎన్నికల ముందు నుంచి ఎన్డీయే భాగస్వామ్య పక్షంగా ఉంది దేశం గౌరవించదగ్గ వ్యక్తి సీపీ రాధాకృష్ణన్
- తెలుగువాడు అన్నప్పుడు గెలిచే అవకాశాలు ఉంటేనే అభ్యర్థిని పెట్టాలి
- ఏపీలో అధికార టీడీపీ-జనసేనతో పాటు ప్రతిపక్ష వైసీపీ కూడా ఎన్డీయే అభ్యర్థికే మద్దతు ప్రకటించాయి.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ**

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన తెలుగు అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి కాకుండా ఎన్డీయే ప్రకటించిన అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతు ఇవ్వడంపై ఏపీ సీఎం చంద్రబాబు వివరణ ఇచ్చారు. టీడీపీ ఎన్నికల ముందు నుంచి ఎన్డీయే భాగస్వామ్య పక్షంగా ఉందని ఆయన తెలిపారు. కాబట్టి ఎన్డీయే అభ్యర్థికే తమ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. - మిగతా3లో



## ప్రభుత్వాన్ని జైలు నుంచి నడిపిస్తారా?

- క్రిమినల్ నేతల బిల్లుపై ప్రధాని మోదీ
- అవినీతికి వ్యతిరేకంగా ఎన్డీయే ప్రభుత్వం చట్టాన్ని రూపొందించింది
- ఈ చట్ట పరిధిలోకి ప్రధానమంత్రి కూడా వస్తారు
- ఒకవేళ ఈ చట్టం ఆమోదం పొందితే, అప్పుడు జైలులో ఉన్న ప్రధాని అయినా, సీఎం అయినా.. 31వ రోజు తన పదవిని కోల్పోవాల్సి వస్తుంది



## జైలులో ఉండి ప్రభుత్వాన్ని నడిపే సీఎం దేశానికి అవసరమా?


- అప్పుడు కేజ్రీవాల్ రాజీనామా చేసి ఉంటే.. ఇప్పుడు ఈ బిల్లు వచ్చేది కాదు
- కేజ్రీవాల్ లిక్కర్ పాలసీ కుంభకోణంలో జైలుకు వెళ్లి అక్కడ నుంచి ప్రభుత్వాన్ని నడిపారు.
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

## నేను పుట్టుకతోనే కాంగ్రెస్ వాడిని..



- జీవితాంతం ఆ పార్టీలోనే కొనసాగుతా
- తాను బీజేపీ లేదా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తో చేతులు కలిపే ప్రసక్తే లేదు
- ప్రస్తుతం పార్టీని నడిపిస్తున్న తాను, ఒక మూలస్తంభంలా అండగా నిలుస్తా
- బీజేపీలో చేరతాడన్న ప్రచారానికి బ్రేక్ వేసిన డీకే

## పార్లమెంట్ వద్ద భద్రతా ఉల్లంఘన..



- గోడ దూకి లోపలికి వెళ్లిన చొరబాటుదారుడు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటిరోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం
- జులై 21న ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి

## పదేళ్లలో భాజపా పాలిత రాష్ట్రాల్లో 20 తొక్కిసలాటలు

- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య
- భాజపా నేతలు వాటిపై ఎందుకు స్పందించట్లేదని
- 2008 హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో తొక్కిసలాట.. అదే ఏడాది జరిగిన జోథ్‌పుర్ తొక్కిసలాట
- కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 39 మంది ప్రాణాలు కోల్పోతే ఆ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మృతుల వివరాలు కూడా వెల్లడించలేదు



## సాస్కి కింద అదనంగా
## ఐదు వేల కోట్లు ఇవ్వండి



- కేంద్ర ఆర్థికమంత్రిని కోరిన సీఎం చంద్రబాబు
- సింగిల్ నోడల్ ఏజెన్సీ ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం రూ. 250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి
- తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నా

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఢిల్లీ వెళ్లిన ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించవలసిందిగా కేంద్ర ఆర్థికమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటివరకు ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం పథకం కింద రూ. 2,010 కోట్లు లభించాయని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం అదనంగా రూ. 5,000 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రికి వినతి పత్రం సమర్పించారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం రూ. 250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన - మిగతా3లో



## చోద్యం చూస్తున్నారా?

- 'బీహార్ ఓట్ల తొలగింపు'లో రాజకీయ పార్టీలపై సుప్రీం కోర్టు ఆగ్రహం
- ప్రజల హక్కులను కాపాడే బాధ్యత రాజకీయ పార్టీలదే
- కానీ ప్రతిస్పందించడంలో వాళ్లు విఫలమయ్యారు
- బూత్ స్థాయి ఏజెంట్లు నియమించిన తర్వాత కూడా రాజకీయ పార్టీలు ప్రజలకు సహాయం చేయడంలో విఫలమయ్యాయి.

## యూరియా కొరతపై
## విజిలెన్స్ నిఘా

- రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు
- జిల్లాల వారీగా మానిటరింగ్
- కలెక్టర్లకు సీఎస్ విజయానంద్ ఆదేశం
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో సమీక్ష



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ భరోసా ఇస్తోంది. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్ కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోనే ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని అధికారులు చెప్పారు. గతం కంటే ఇప్పుడు ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. అలాగే రైతులు కూడా అవసరానికి తగ్గట్టే యూరియాను కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. రైతుల ఎరువుల అవసరాలను తీర్చేందుకు... సమయానికి, సమద్ధిగా ఎరువులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. - మిగతా3లో

## కౌన్సిలర్ జాకీర్ చేత మిస్టర్ ఆర్కె మొబైల్ షోరూం ప్రారంభం



**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 22:** కుప్పం పట్టణంలో మిస్టర్ ఆర్కే మొబైల్ షోరూం మొదటి బ్రాంచ్ కాగా రెండవ బ్రాంచ్ గురువారం వీకోట పట్టణం లోనీ ఎంజి రోడ్డులో ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ మైనార్టీ విభాగ అధ్యక్షులు, కుప్పం మున్సిపల్ కౌన్సిలర్ జాకీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి, షోరూం యజమానులు రఫీక్, సన వుల్లా పుష్ప గుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జాకీర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## అపర భగీరథుడు ఏపీ సీఎం చంద్రబాబు

**చిత్తూరు (ఢిల్లీ),చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**



రాయలసీమ ప్రాంతంలోని ప్రతి ఆయికట్టుకు నీరందించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి. అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపర భగీర థుడిలా అహర్నిశలు శ్రమిస్తున్నారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. కుప్పం నియోజకవర్గాన్ని హంద్రీ-నీవా జిలాలతో సస్యశ్యామలం చేయడమే తన సంకల్పంగా భావించి, ముందుకు సాగుతుండడం ఏపీ సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరై.., దేశరాజధాని ఢిల్లీలో ఉన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ఈ నెల 30న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో కృష్ణా జలాలకు హారతి పట్టనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు కృషిని పాలనా దక్షతను శుక్రవారం ఓ ప్రకటనలో కొనియాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు పార్లమెంటు పరిధిలోని కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు చేరుకోవడం పై హర్షం వ్యక్తం చేశారు. దీనికి కారణమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ., ఆయన నిత్య శ్రామికుడనీ, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప పరిపాల నాదక్షుడం టూ ప్రశంసించారు. అంతేకాకుండా ఇటు అధికారులు,అటు కూటమి నాయకులు, కార్యకర్తలకు సీఎం స్ఫూర్తిగా నిలవడం అభినందనీయమన్నారు.వైసిపిప్రభుత్వం హయాంలో ఆగిపోయిన హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరుగులు తీయిం చిందన్నారు. సీఎం చంద్రబాబు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ.., నిర్ణీత గడువులోగా హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను పూర్తి చేశారని తెలిపారు. 530 కోట్ల వ్యయంతో 265 కిలోమీటర్ల కాల్వ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసి, కృష్ణా జలాలు కుప్పానికి చేరుకునేందుకు శ్రమించిన అధికారులను ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అభినందించారు.

### నూతనంగా నియమితులైన పిఎంకె

## వుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబుకు సన్మానం




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 22:**
కుప్పం పట్టణం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతనంగా నియమితులైన పిఎంకె వుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబుకు చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు మంజునాథ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారుల సంఘం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ.. ముందుగా తనను నమ్మి పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. తనను సన్మానించి అభినందనలు తెలిపిన తెలుగు తమ్ముళ్లకు, చిరు వ్యాపారుల సంఘం కమిటీ సభ్యుల అభిమానాన్ని ఎన్నటికీ మరిచిపోలేమని, పార్టీ అధినేత నమ్మకాన్ని కాపాడుకుంటూ, సాటి నాయకుల అభిమానాన్ని నిలుపుకునేలా తమ పదవీ బాధ్యతలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెరుమాళ్ స్వామి, కార్యదర్శి మతీన్, ట్రెజరర్ పటేల్ బాబు, లాలూ, సురేష్, యారాబ్, రాజువేలు, ప్రవీణ్, అప్పి, చంద్ర, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### నూతనంగా నియమితులైన

## రెస్కో చైర్మన్ ప్రతాప్‌కు సన్మానం





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 22:**
కుప్పం పట్టణం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతనంగా నియమితులైన రెస్కో చైర్మన్ ప్రతాప్‌కు చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు మంజునాథ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. ముందుగా తనను నమ్మి పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంకు ధన్యవాదాలు తెలిపారు. తనను సన్మానించి అభినందనలు తెలిపిన చిరు వ్యాపారుల సంఘం సభ్యుల అభిమానాన్ని ఎన్నటికీ మరిచిపోలేమని, పార్టీ అధినేత నమ్మకాన్ని కాపాడుకుంటూ, సాటి నాయకుల అభిమానాన్ని నిలుపుకునేలా తమ పదవీ బాధ్యతలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెరుమాళ్ స్వామి, కార్యదర్శి మతీన్, ట్రెజరర్ పటేల్ బాబు, లాలూ, సురేష్, యారాబ్, రాజువేలు, ప్రవీణ్, అప్పి, చంద్ర, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.ఐ

# మురికి కూపముగా ఆగ్నేయ వినాయక స్వామి మూలస్థానం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**
శ్రీకాళహస్తి వాయు లింగేశ్వర దివ్య క్షేత్రములో నవ సంధి వినాయకలో ఒకటి అయినా ఆగ్నేయ గణపతి పున్న నిర్మాణం కోసం దేవస్థానంఅధికారులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఉన్న ఆలయాన్ని తొలగించి పునర్నిర్మాణం జరగకుండా మురికి కూపముగా తయారుచేసిందని శ్రీకాళ హస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి , శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు సంయుక్తంగా పరిశీలించినారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో నడిబొడ్డులో ఆలయం పున నిర్మాణపనులు చూడాల్సిన బాధ్యత అధికారులు మురికి గుంటక తయారు చేసి ఎంతమంది జనాలు వచ్చి పోతుంటే కూడా అధికారుల యొక్క నిర్లక్ష్యం పరాకాష్టంకు చేరింది శ్రీకాళహస్తిలో వెంటనే మురికి కాలువ నీటిని డైవర్ట్ చేసి పునర్నిర్మాణ పనులు చేయాల్సిందిగా తెలియజేశారు. శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకి కూడా మంచిది కాదు ఆగ్నేయంలో గణపతిని తొలగించి వెంటనే పునర్నిర్మాణ పనులు చేయాల్సిందిగా ఆలోచన ఉండాలి కదా. పున నిర్మించకుండా బాలాలయం చేసి కూడా ఈ విధంగా పనులు ఆపడం ఏంది తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని పత్రిక ప్రకటనలో ద్వారా తెలియజేశారు. అధికారుల లోపమా పాలకుల లోపమా అని తెలియజేశారు. అధికారులు వెంటనే సమన్వయం చేసుకొని పునర్నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి లేకుంటే మేమే వ్యక్తిగతంగా ఆలయము పునర్నిర్మాణ పనులను చేపడతామని తెలియజేశారు. ఈ సందర్భ ంగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా ఉన్నప్పుడు నవసంధి వినాయక స్వామి ఆలయాల అన్నిటిని జీర్ణోద్ధరణ చేయడం జరిగింది అయితే ఆగ్నేయ గణపతి శిథిలావస్థకుచేరుకోవడంతో వెంటనే ఆలయాన్ని తొలగించి పునర్నిర్మాణం పనులను చేయాల్సిందిగా ట్రస్ట్‌బోర్డ్ తీర్మానం జరిపి ఎస్టిమేషన్ కూడా జరిపి టెండర్ కూడా పిలవడం జరిగిందని తెలియజేశారు. అయితే



ఎలక్షన్‌కోడ్ సందర్భంగా పనులను ఆగినప్పటికీ కూడా పున్న నిర్మాణం చేస్తున్నారని సంతోషం కలిగింది బాలాలయం జెరిపిన రోజు కూడా సంతోషం కలిగింది కచ్చితంగా 27 రోజుల్లో ఆలయ పున్ననిర్మాణ పనులను పూర్తిచేసే కాంట్రాక్టర్ ఉన్నప్పటికీ కూడా అధికారుల యొక్క సమన్వయం లోపంతో మున్సిపల్ అధికారులతో మాట్లాడుకపోవడంతో డ్రైనేజీ డైవర్ట్ చేసుకోకపోవడంతో అదేవిధంగా అక్కడ ఉన్న ఇంటి యజమానులతో సౌమ్యంగా మాట్లాడితే ఇంకా అతని యొక్క వ్యక్తిగతంగా స్థలాన్ని కూడా ఇవ్వడానికి ఉన్నారు తెలియజేశారు. కాబట్టి వెంటనే అధికారులు నాలుగు గోడల మధ్యలోనే అధికారాన్ని చలాయించకుండా ఎక్కడైతే నిర్మాణాలు జరుగుతున్నాయో ఆ నిర్మాణాలు ఎందుకు ఆగిపోతాందో వాటి అన్నిటి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత దేవస్థానం ఈఓ ఈ విషయంలో శ్రద్ధ తీసుకుని వెంటనే పునర్నిర్మాణ పనులను చేయకపోతే శ్రీకాళహస్తి పట్టణానికి మంచిది కాదని తెలిపారు . గణపతి మూలస్థానం ఇంత కూపముగా ఏర్పడితే చాలా దౌర్భాగ్య స్థితి ఉంది. వెంటనే దీని కరెక్షన్ చేయాల్సిందిగా మీడియా ద్వారా తెలియజేస్తున్నాను. అదేవిధంగా కొండమిట్ట ప్రాంతంలో నిత్యం వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి అక్కడ ఎటువంటి సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధనమున్న రాయల్,బుల్లెట్ జయ శ్యామ్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, నియోజవర్గ యువత అధ్యక్షులు సుర సురేష్, నియోజవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫరీద్ జీవీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌కు

## చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళశుభాకాంక్షలు



**చిత్తూరు(ఢిల్లీ),చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**
దేశరాజధాని హస్తినలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం పలికిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, శుక్ర వారం ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, సహచర ఎంపీలతో ఎన్డీఏ భాగస్వామి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపిరాధాకృష్ణన్‌న్ను మర్యాదపూర్వకంగా కలిసారు. దేశ ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కాబోతున్న సిపి రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

## మట్టి వినాయకుడిని పూజించండి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**
పర్యావరణానికి మేలు చేసే మట్టి వినాయకుడిని వినాయక చవితి సందర్భంగా పూజించాలని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి చిదంబరం సూచించారు. కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ మరియు చరిష్మా గ్రామీణ అభివృద్ధి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీమతి అనసూయ వారి సహకారంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మట్టి వినాయకుడి యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు అనసూయ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసే వినాయకుడి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని తెలియజేశారు. కుప్పం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ మహేష్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీళ్లలో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై చర్మవ్యాధులు మరియు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మట్టి వినాయకులను విద్యార్థుల చేత తయారు చేయించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి. నారాయణమూర్తి, అధ్యాపకులు ప్రదీప్ కుమార్, డాక్టర్ రాజలక్ష్మి, డాక్టర్ మాధవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మునస్వామి పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**
మునస్వామి పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన ఎస్ఆర్‌పురం మండలంలో చోటు చేసు కున్నది. ఎస్సై సుమన్ కథనం మేరకు పీల్లారి కుప్పం గ్రామంలో జగన్నాథం అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన, మునస్వామి అనే వ్యక్తికి పాత కక్షలు ఉండేవి గురువారం సాయంత్రం మునస్వామి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన జగన్నాథం తన ట్రాక్టర్ తో మునస్వామి ద్విచక్ర వాహనాన్ని ఢీకొని మునస్వామి ఇంటి గేటు ను ఢీకొనడంతో మున స్వామికి రక్తం గాయాల యింది. ప్రస్తుతం మునుస్వామి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసి జగన్నాథంను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిం చామని ఎస్ఐ సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు చెప్పడం, ఏమంటే ఎవరై నా దౌర్జన్యం రౌడీయిజం చేస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుమన్ హెచ్చరించారు

## రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్

### శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**
శ్రీకాళహస్తి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోలా ఆనంద్‌ని నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కోలా ఆనంద్ పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కోలా ఆనంద్ పార్టీ అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ సంస్థాగతంగా క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. అగ్ర నేతల బహిరంగ సభలు ప్రధాని నరేంద్ర మోడీ , జేపీ నడ్డా , రాష్ట్ర అధ్యక్షుల సభలు విజయవంతం చేయడంలో ఎనలేని కృషి చేశారని పలువురు కోలా ఆనంద్ అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవి వరించడానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులకు శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ నేతలు పలువురు కలసి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అందరూ కలిసి కోలా ఆనంద్ ఘనంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు, అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, బీడీ బాలాజీ, ఎస్వీ రమణ, కొండేటి గోపాల్, జీవి అమర్నాథ్, ప్రజ్ఞశ్రీ, మండల అధ్యక్షులు వేడం కృష్ణయ్య, పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, బాగీర్తి ధనుష్, శివా రెడ్డి తదితరులు కలసి కోలా ఆనంద్ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

### జనసేన పార్టీ ఆధ్వర్యంలో

## గంగమ్మ ధర్మకర్తల మండలి సభ్యత్వానికి దరఖాస్తుల వెల్లువ



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 22:**
శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యత్వానికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో వెల్లువలా దరఖాస్తులు చేసుకున్నారు. రాష్ట్ర కల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి చిన్న రాయల్ మరో 13 మంది ధర్మకర్తల మండలి సభ్యత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. తొలిత జనసేన పార్టీ పుంగనూరు నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు కలిసి వారందరూ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని ఈవో కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఏకాంతముకు దరఖాస్తులు చేసుకున్నారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు పసుపులేటి హరిప్రసాద్ కోలా సోమశేఖర్ చిన్న రాయల్ ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బోయకొండ గంగమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు, అనంతరం బోయకొండపై జరగబోయే అభివృద్ధిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చరణ్ రాయల్ పుంగనూరు చైర్మన్ పగడాల రమణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవి ఆయురారోగ్యాలతో రాణించాలి

### జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు22:**




నటులు, మాజీ శాసన సభ్యులు మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదినం సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి తెలియజేశారు. తన నటనతో వేలాది మంది అభిమానులను సొంతం చేసుకున్నా ఆయన ఎన్టీఆర్ తరువాత ఆ స్థానాన్ని కైవసం చేసుకున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని పాత్రలతో ఆయన అభిమానులతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను అలరించాలని అదేవిధంగా జీవితాంతం ఆయురారో గ్యాలతో ఆయన అన్ని అంశాలలో రాణించాలని ఆకాంక్షించారు.

# ఆకాశమే హద్దుగా.. అదే కీలకం

**తాడేపల్లి:** వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ ఆకాశమే హద్దుగా పనిచేయాలని.. ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని.. ఆ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీది ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, అన్ని జిల్లాల ప్రచార విభాగం అధ్యక్షులతో సమావేశం శుక్రవారం జరిగింది.

ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం కీలకమైన విభాగం. అన్ని అనుబంధ విభాగాలలో కూడా ఈ విభాగం సభ్యులు చురుగ్గా పాల్గొనే అవకాశం ఉంటుంది. ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడానికి మీకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పబ్లిసిటీ వింగ్‌లో మనకు ఉన్న అవకాశాన్ని వినియోగించుకుని ఎంత ఉత్సాహంగా పనిచేయగలిగితే అంత గుర్తింపు వస్తుంది. ఆకాశమే హద్దుగా మనం పనిచేసే అవకాశం ఈ విభాగంలో ఉంటుంది" అని సజ్జల పేర్కొన్నారు. "ఈ వింగ్‌లో కష్టపడి పనిచేసి తగిన



గుర్తింపు తెచ్చుకునే అవకాశాలు కూడా మీకు ఎక్కువగా ఉంటాయి. పార్టీని బలోపేతం చేయడం కోసం ఈ విభాగం ఎంతవరకు ఉపయోగపడుతుందనేది మీరు అంచనాలు వేసుకుని తగిన విధంగా పనిచేయగలిగేలా ఉండాలి. ఇందుకు తగిన విధంగా కమిటీల నియామకం జరగాలి. పార్టీ లైన్‌కి తగ్గట్లుగా ముందుకెళుతూ విస్తృతంగా ప్రచారం చేయాలి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచడంలో ముందుండి ఉత్సాహంగా పనిచేయాలి. క్రియాశీలకంగా పనిచేసే సైన్యంలో మీరు భాగస్వాములవ్వాలి. చంద్రబాబు తప్పుడు ప్రచారంతో, అబద్దాలను నిజమని నమ్మించడంలో ముందుంటారు. మన పార్టీ ప్రజల పక్షంగా ఉంటుంది కానీ ఎప్పుడూ తప్పుడు ప్రచారాలను నమ్ముకోలేదు. ప్రజల అభిప్రాయలకు అనుగుణంగా మనం ముందుకెళ్ళాలి. రాష్ట్రాన్ని దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత జగన్‌ది. చంద్రబాబు అబద్ధపు మాయా ప్రపంచాన్ని ప్రజల ముందు తేటతెల్లం చేయాలి. పార్టీ అనుబంధ విభాగాలన్నీ ఒక్క తాటిపైకి వచ్చి పార్టీని, అధినేతను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్ళాలి. నిర్మాణాత్మకంగా కమిటీల నియామకం చేసుకుని ముందుకెళదాం" అని సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్ధేశం చేశారు.

# ఈ అరాచకాలకు చంద్రబాబే రాజగురువు'

**తాడేపల్లి :** టీడీపీ ఎమ్మెల్యేలు,మంత్రులు చేస్తున్న గలీజు పనులకు చంద్రబాబు నాయుడే రాజగురువు అని వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్ ధ్వజమెత్తారు. టీడీపీ అనేది డర్టీ పార్టీ అని, ఆ పార్టీ నేతలు చేసేవన్నీ డర్టీ పనులేనని మండిపడ్డారు. ఈ రోజు(శుక్రవారం, ఆగస్టు 22వ తేదీ) తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన పోతిన మహేష్.. 'జనానికి టీడీపీ అనే డర్టీ పార్టీ మీద చిరాకు వేసింది. పబ్లిక్‌గా బూతు పనులు చేస్తున్న ఎమ్మెల్యేలకు చంద్రబాబు వత్తాసు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, అరాచకాలకు చంద్రబాబు రాజగురువు. ఈ 15 నెలల్లో అరాచకాలు చేసిన ఏ ఎమ్మెల్యేపైనైనా చర్యలు తీసుకున్నారా? ఏమైనా అరెస్టులు చేశారా? బోను ఎక్కించారా? చట్ట ప్రకారం ఎవరి మీదైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. గత వారం రోజులుగా టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల అవినీతి అరాచకాలపై పుంఖాను పుంఖాలుగా వార్తలు వచ్చాయి. అటవీ శాఖ ఉద్యోగుల మీద దాడి చేసిన ఎమ్మెల్యే బుడ్డా మీద ఏం చర్యలు తీసుకున్నారు?, డీలర్లతో కమీషన్ల వ్యవహారం బయటపడితే అచ్చెనాయుడు మీద ఎందుకు చర్యలు



తీసుకోలేదు?, కనీసం విచారణకు కూడా ఎందుకు ఆదేశించలేదు?, రౌడీషీటర్ శ్రీకాంత్‌కు పెరోల్ ఇవ్వాలని సిఫార్సు చేసిన ఇద్దరు ఎమ్మెల్యేలు, హోంమంత్రి అనిత మీద ఎందుకు చర్యలు తీసుకోలేదు?, ఒక్కరి మీదనైనా చర్యలు తీసుకునే దమ్ము చంద్రబాబుకు లేదు. ఎమ్మెల్యే నసీర్ వేధింపులతో ఒక మహిళ ఆత్మహత్యాయత్నం చేస్తే చర్యలు తీసుకోలేదు ఎందుకు?, మహిళా ప్రొఫెసర్ మీద వేధింపులకు దిగిన కూన రవికుమార్ మీద ఎందుకు చర్యలు తీసుకోలేదు?, ఎమ్మెల్యేల మీద చంద్రబాబు సీరియస్ అని ఎల్లోమీడియాలో ట్రోలింగ్ వేయించుకుని చేతులు దులుపుకున్నారు. జూ.ఎన్టీఆర్‌ని బూతులు తిట్టిన ఎమ్మెల్యే మీద ఏం చర్యలు తీసుకున్నారు?, బాధితులు పోలీసు స్టేషన్లకు వెళ్తే తిరిగి వారిమీదే కేసులు పెట్టే సంస్కృతి ఇప్పుడే చూస్తున్నాం. అటవీశాఖ అధికారుల మీద దాడి చేస్తే పవన్ కళ్యాణ్ మౌనం వహించారు. పవన్‌ని నమ్ముకుంటే ఎవరైనా నట్టేట మునుగుతారు. సుగాలి ప్రీతి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ వ్యవహారాల్లో ఏం చేశారు?, చంద్రబాబు ప్రయోజనాలే తప్ప పవన్‌కు ప్రజలతో పనిలేదు. చంద్రబాబు పాలన రాక్షస పాలనఈ అరాచకాలకు ప్రజలే తగిన బుద్ది చెప్పే టైం దగ్గర్లోనే ఉంది' అని హెచ్చరించారు.

# అరుణ చుట్టూ రాజకీయం

**నెల్లూరు :** వైసీపీలో వైభోగం అనుభవించింది, కూటమి వచ్చాక పాత పరిచయాలతో రెచ్చిపోయింది. చివరకు జైలు కెళ్లింది. సింపుల్ గా ఇదీ అరుణ స్టోరీ. ఆమె జైలుకెళ్లడంపై రెండు పార్టీల నేతలు తీవ్ర వాదోపవాదాలు చేసుకుంటున్నారు. ఆమె వైసీపీ అంటే కాదు, టీడీపీ అంటున్నారు. మీ పార్టీ ఆమెను పెంచి పోషించిందంటే, మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఆటలు సాగాయంటూ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారు. ఆమెకు సహకరించిన నేతలు మాత్రం తేలుకుట్టిన దొంగల్లా సైలెంట్ అయ్యారు. నిడిగుండ అరుణ సోషల్ మీడియా అకౌంట్లు చూస్తే మాత్రం ఆమె ఏ పార్టీనో, ఏ పార్టీకి మద్దతిస్తారో, ఏయే అధికారులతో ఫొటోలు దిగారనేది స్పష్టంగా తెలిసిపోతుంది. వైసీపీ హయాంలో వైభోగం.. నిడిగుండ అరుణ అలియాశ్ దిశ అరుణ.. వైసీపీ హయాంలో ఆమె తనను తాను దిశ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్యక్షురాలిగా చెప్పుకునేది. అందుకే ఆమె దిశ అరుణ అయ్యారు. దిశ అరుణగా రాజకీయ నాయకులతో కలసి మెలసి తిరిగేది, వారి బర్త్ డే వేడుకలకు హాజరై కేక్ తినిపించేది. ఆ వీడియోలు, ఫొటోలన్నీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. వైసీపీ ఆఫీస్ లో ఆమె పెట్టిన ప్రెస్ మీట్ వీడియోలు కూడా ఇప్పుడు వైరల్ గా మారాయి. వైసీపీ పార్టీ నేతగా అరుణ ప్రచారం చేసుకున్నారని, ఆ పార్టీ నేతలు కూడా ఆమెకు సహకరించారని టీడీపీ వెటకారం చేస్తోంది. అయితే ఇక్కడ వైసీపీకి తప్పించుకునే అవకాశం కూడా లేదు. ఫొటోలు, వీడియోలు, అన్నీ పగడ్బందీగా ఉండటంతో సోషల్ మీడియా దెబ్బకి వైసీపీ తేలు కుట్టిన దొంగలా మారింది. టీడీపీ సంగతేంటి..? వైసీపీ హయాంలో ఆమె తప్పులు చేసింది సరే, మరి కూటమి వచ్చాక అయినా ఆ తప్పులకు లెక్కలు చెప్పాలి కదా. కానీ ఇప్పుడు కూడా అదే జరిగింది. వాస్తవానికి అరుణ ప్రియుడు శ్రీకాంత్ పెరోల్ పై విడుదల కావడం మరింత సంచలనంగా మారింది. మీడియా హడావిడి వల్ల అసలు విషయం బయటకు పొక్కడంతో ప్రభుత్వం నష్టనివారణ చర్యలు తీసుకుంది. శ్రీకాంత్ పెరోల్ రద్దయింది, బెదిరింపుల



కేసులో అరుణ అరెస్టై జైలుకెళ్లింది. అయితే ఈ పెరోల్ కోసం టీడీపీ ఎమ్మెల్యేలు కొందరు కృషి చేశారనే ఆరోపణలు పార్టీని ఇబ్బంది పెట్టాయి. తనకే సంబంధం లేదని, తన నియోజకవర్గానికి చెందిన వారు వస్తే పెరోల్ కోసం సిఫారసు చేశానని, అయినా తన లేఖ వల్ల పెరోల్ రాలేదంటూ గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రెస్ మీట్ పెట్టి మరీ వివరణ ఇచ్చారు. మరికొందరు నేతల పేర్లు వినపడుతున్నా వారు బయటకు రావడానికి జంకుతున్నారు. అంతా ఆ ఫోన్లలోనే.. అరెస్ట్ సమయంలో నిడిగుండ అరుణ నుంచి పోలీసులు రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్లలో అసలు వ్యవహారం అంతా ఉందని తెలుస్తోంది. పోలీస్ అధికారుల వ్యవహారాలు కూడా అందులో ఉన్నాయట. అదే సమయంలో రాజకీయ నాయకులతో ఆమె దిగిన ఫొటోలు, ఆడియో కాల్స్ రికార్డింగ్ లు కూడా ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజం ఎంతున్నా.. అందులోనీ సమాచారం అంతా బయటకు వస్తుందని ఆశించలేం. ఈ విషయంలో తలాపాపం తిలా పిడికెడు అన్నట్టుగా ఉంది వ్యవహారం. ఆమె బాధితులు అన్ని పార్టీల్లోనూ, చివరకు ప్రభుత్వ విభాగాల్లో కూడా ఉండటం విశేషం. సో అందరూ దొంగలే కాబట్టి, అందరూ సైలెంట్ గానే ఉన్నారు. ఈ వ్యవహారంలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం మినహా ఇంకో అడుగు ముందుకు వేయడం లేదు.

# షర్మిళకు దారేదీ...



**కడప :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల పునరాలోచనలో పడ్డారా? కాంగ్రెస్ లో కొనసాగితే ఇక రాజకీయ భవిష్యత్ ఉండదని ఆమె ఒక క్లారిటీకి వచ్చినట్లు తెలిసింది. అందుకే అప్పుడప్పుడు అలా వచ్చి ఇలా వెళుతున్నారంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎటు చూసినా కాంగ్రెస్ పార్టీకి రాజకీయ భవిష్యత్ లేదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ కు దాదాపుగా నూకలు చెల్లినట్లే. అసలు ఓటు బ్యాంకు కూడా లేదు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం వైసీపీ అధినేత జగన్ కొల్లగొట్టుకుని వెళ్లిపోయారు. ఆ ఓటు బ్యాంకును తిరిగి సాధించడం మాత్రం జరిగే పని కాదు. ఒకవైపు అనాలోచితంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ ను క్షమించకూడదని ప్రజల్లో బలంగా సెంటిమెంట్ నాటుకుపోయింది. అదే సమయంలో జగన్ పార్టీకి దాదాపు పదేళ్ల నుంచి అలవాటుపడిపోయిన ఓటు బ్యాంకు తిరిగి కాంగ్రెస్ వైపునకు చూసే ఛాన్స్ లేదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన చేసిన తర్వాత ఎన్ని మార్పులు చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు వైఎస్ కుమార్తె అయిన షర్మిలను తెచ్చిపెడితే కనీసం కొన్ని సీట్లు అయినా రకపోతాయా? అని భావించి ఆమెకు పీసీసీ చీఫ్ పదవి ఇచ్చింది. అయితే గత ఎన్నికల్లో సేమ్ సీన్ రిపీట్ అయింది. షర్మిల కూడా పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఇక పార్టీ కేంద్ర నాయకత్వానికి కూడా ఆంధ్రప్రదేశ్ పై ఆశలు వదిలేసుకుంది. అందుకే పెద్దగా ఏపీ పాలిటిక్స్ ను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని అంటున్నారు.ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ కాంగ్రెస నాయకులు కూడా... రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ దేశమంతా అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావిస్తున్నప్పటికీ ఏపీ పేరును ఎత్తకపోవడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. మరొకవైపు వైఎస్ షర్మిల నాయకత్వంపై కూడా చాలా మంది నేతలలో ఉన్న అపోహలు తొలిగిపోయాయంటున్నారు. షర్మిల తన పదవిని అడ్డం పెట్టుకుని కేవలం తన సోదరుడు జగన్ పై విమర్శలు చేయడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని, వ్యక్తిగత విభేదాలకే పెద్దపీట వేస్తున్నారని అంటున్నారు. అందుకే పార్టీలో సీనియర్ నేతలు హర్షకుమార్, చింతామోహన్ వంటి నేతలు కూటమి ప్రభుత్వంపై గళం విప్పాల్సి వస్తుందంటున్నారు. ఈ సమయంలో వైఎస్ షర్మిల వేరే దారి వెతుక్కోవాల్సిందేనా? అన్న అభిప్రాయం ఆమె అనుచరుల నుంచి వినిపిస్తుంది. కాంగ్రెస్ లో ఎన్నాళ్లున్నా ఇంతే పరిస్థితి అని వారు షర్మిలకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. మరి వైఎస్ షర్మిల ఏం నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## సాస్కి కింద అదనంగా ఐదు వేల కోట్లు ఇవ్వండి

-మొదటిపేజీ తరువాయి

ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.
తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి..ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందగలదని తెలిపారు. దీని విధివిధానాలు రూపొందించి త్వరగా ఈ పథకాన్ని అమల్లో తేవాలని ముఖ్యమంత్రి కోరారు.

## మేమెలా మద్దతిస్తాం..

-మొదటిపేజీ తరువాయి

దేశం గౌరవించదగ్గ వ్యక్తి సీపీ రాధాకృష్ణన్ అని తెలిపారు. ఆయన దేశానికి, ఉప రాష్ట్రపతి పదవికి వన్నె తెస్తారని ఆకాంక్షించారు. తెలుగువాడు అన్నప్పుడు గెలిచే అవకాశాలు ఉంటేనే అభ్యర్థిని పెట్టాలని ఇండియా కూటమికి చంద్రబాబు సూచించారు. గెలిచే అవకాశం లేకపోయినా అభ్యర్థిని పెట్టి ఇండియా కూటమి రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. అది కాకుండా ఎన్డీయే కూటమిలో ఉన్నప్పుడు ప్రతిపక్ష (ఇండియా కూటమి) అభ్యర్థికి ఎలా మద్దతిస్తామని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే.. ఏపీలో అధికార టీడీపీ-జనసేనతో పాటు ప్రతిపక్ష వైసీపీ కూడా ఎన్డీయే అభ్యర్థికే మద్దతు ప్రకటించాయి. తెలుగు వ్యక్తి కాకుండా ఎన్డీయే అభ్యర్థికి అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలపడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. బీజేపీ అంటే బాబు, జగన్ , పవన్ కల్యాణ్.. ఈ ముగ్గురు మోదీ తొత్తులే అని విమర్శించారు. బీజేపీకి ఊడిగం చేసే బానిసలే అని మండిపడ్డారు. టీడీపీ, జనసేన పార్టీలది తెరమీద పొత్తు అని.. వైసీపీది తెర వెనుక అక్రమ పొత్తు అని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో %చీణూ% కూటమి నిలబెట్టిన బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వడానికి వైసీపీకి సిగ్గుండాలని షర్మిల మండిపడ్డారు. అవినీతి కేసులకు భయపడి బీజేపీకి మళ్లీ దాసోహం అన్నారని విమర్శించారు. ఐదేళ్లు దోచుకుతిన్నది దాచుకోవడానికి బీజేపీకి జై కొట్టారని అన్నారు. ఈ దేశ ప్రతిపక్షాలన్నీ కలిసి రాజకీయాలతో సంబంధం లేని ఒక తెలుగు బిడ్డ, న్యాయ నిపుణుడిని నిలబెడితే, బీజేపీ నిలబెట్టిన %=ూా% వాడికి మద్దతు ఇస్తారా ? ఇది తెలుగు ప్రజలకు చేసిన ద్రోహం కాకపోతే మరేంటని ప్రశ్నించారు.

## యూరియా కొరతపై విజిలెన్స్ నిఘా

-మొదటిపేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టిందని చెప్పారు. అలాగే ధరలు పెరగకుండా చూస్తున్నామని అధికారులు చెబుతున్నారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది. రైతుల అవసరాలను దష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ ప్రణాళికలతో ఎరువుల సరఫరా చేపట్టింది. గత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 8,76,928 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ సంవత్సరం అదే కాలానికి 10,96,239 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగమయ్యాయి. అంటే, గత సంవత్సరం కంటే 2,19,311 మెట్రిక్ టన్నులు అధికంగా ఎరువులను రైతులు కొనుగోలు చేశారు. యూరియా వినియోగం 2024లో 3,74,290 మెట్రిక్ టన్నుల నుంచి ఈసారి 4,57,727 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇది 83,436 మెట్రిక్ టన్నుల అధిక వినియోగాన్ని సూచిస్తోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. డీఏపీ వినియోగం 1,17,582 మెట్రిక్ టన్నుల నుంచి 1,37,884 మెట్రిక్ టన్నులకు పెరిగి 20,302 మెట్రిక్ టన్నుల పెరుగుదల కన్పిస్తోన్న విషయాన్ని అధికారులు వివరిస్తున్నారు. పొటాష్ వినియోగం 39,054 మెట్రిక్ టన్నుల నుంచి 54,276 మెట్రిక్ టన్నులకు పెరిగి 15,222 మెట్రిక్ టన్నుల మేర పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇక కాంప్లెక్స్ ఎరువులు 2,83,866 మెట్రిక్ టన్నుల నుంచి 3,74,229 మెట్రిక్ టన్నులకు చేరి 90,363 మెట్రిక్ టన్నుల వినియోగం ఎక్కువైంది. సూపర్ ఫాస్ఫేట్ వినియోగం కూడా 62,136 మెట్రిక్ టన్నుల నుంచి 72,123 మెట్రిక్ టన్నులకు పెరిగి 9,987 మెట్రిక్ టన్నుల పెరుగుదల కనబరిచిందని అధికారులు చెప్పారు. యూరియా...ఎరువుల కొరత రాకుండా నెలవారీ సరఫరా ప్రణాళికలు అమలు చేసి, అవసరమైన సమయంలో అవసరమైన పరిమాణంలో ఎరువులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కొందరు రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేస్తున్నారని దీని వల్ల ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ కోసమే కాకుండా.. రబీ సీజన్ నిమిత్తమూ ఇప్పుడే ఎరువులను కొనుగోలు చేస్తున్నట్టు తాము గుర్తించినట్టు అధికారులు వివరిస్తున్నారు. రబీ సీజన్లో కూడా ఎరువులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని... రబీ సీజన్ నిమిత్తం 9.22 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఎరువులు ఏపీకి కేటాయించారని అధికారులు చెబుతున్నారు. రైతులకు యూరియా సరఫరాలో ఇబ్బంది లేకుండా ఉండేలా అందుబాటులో ఉంచామని వెల్లడిస్తున్నారు. యూరియా, ఎరువుల సరఫరా ఎక్కువగా ఉందని అధికారులు వివరించారు. ఇంతే కాకుండా.. రైతులకు మరింత భరోసా కల్పించేలా మార్క్ ఫెడ్ కు ఎరువుల కేటాయింపులను పెంచుతున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. అందుబాటులో ఉన్న ఎరువుల్లో ఇకపై 70 శాతం ఎరువులను మార్క్ ఫెడ్ కు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఎరువుల సరఫరా విషయంలో నిత్యం ట్రాకింగ్ పెట్టేలా చూడాలని... బ్లాక్ మార్కెట్టుకు తరలించిన వారిపై కేసులు పెట్టాలని.. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

## పాపం...కమ్మ నేతలు

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ప్రస్తుత మంత్రి వర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో కొందరు నేతలు విస్తరణపై ఆశలు పెట్టుకున్నారు. సీనియర్ నేతలతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాకు చెందిన కమ్మ సామాజికవర్గం నేతలు కూడా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ రెండు జిల్లాలకు చెందిన కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలకు కేబినెట్ లో ఐదేళ్లు అవకాశం దక్కే ఛాన్స్ లేదంటున్నారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు కావడమే మంత్రి వపదవి దక్కకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పాలి.. ఇప్పటికే చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఐదు గురు కమ్మ సామజికవర్గం నేతలు ఉండటమే అందుకు కారణం. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రులుగా నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ లు కేబినెట్ లో ఉన్నారు. ఇందులో నలుగురు టీడీపీకి చెందిన వారు కాగా, ఒక్కరు జనసేనకు చెందిన వారు.ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిగినా చంద్రబాబును తప్పిస్తే మిగిలిన నలుగురిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశాలు లేవనే చెప్పాలి. ఎందుకంటే వీరు యాక్టివ్ గా ఉండటంతో పాటు ప్రాంతాల వారీగా పట్టున్న నేతలు. రాయలసీమలో పయ్యావుల కేశవ్, గుంటూరు జిల్లాలో నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్ లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నలుగురిని తప్పించే అవకాశం లేకపోవడంతో గుంటూరు జిల్లా కమ్మ సామాజికవర్గం ఎమ్మెల్యేలు ఇక మంత్రి పదవిపై ఆశ వదులకోవాల్సిందే. గుంటూరు జిల్లాలో సీనియర్ నేతలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లాంటి వాళ్లున్నారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్ ఉండటంతో మరొకరికి మంత్రి పదవి దక్కే అవకాశం లేదు. అందుకే వీరిలో కొందరికి మాత్రం ఏదో ఒక కేబినెట్ ర్యాంక్ పదవి దక్కే అవకాశాలున్నాయంటున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన కమ్మ సామాజికవర్గం ఎమ్మెల్యేలు మాత్రం ఈ దఫా కేబినెట్ లో చోటు దక్కడం కష్టంగానే ఉంది. ఇక కృష్ణా జిల్లాలో కమ్మ సామాజికవర్గం నేతలున్నప్పటికీ వారిలో పెద్దగా సీనియర్లు లేకపోవడం కొంత కలసి వచ్చే అంశమే. గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారే. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఒకరకంగా సీనియర్ అనే చెప్పుకోవాలి. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక బీజేపీ నుంచి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి కూడా ఆ సామాజికవర్గమే అయినా బీజేపీ కేంద్ర నాయకత్వం విస్తరణలో వీరిద్దరికీ చోటు కల్పిస్తుందని చెప్పలేని పరిస్థితి. ఇందులో కామినేని సీనియర్. సుజనా చౌదరి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. కృష్ణా జిల్లాలో బీసీ వర్గానికి చెందిన కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి కూడా ఉండటంతో కూటమిలోని కమ్మ సామాజికవర్గం నేతలకు కేబినెట్ లో చోటు దక్కే ఛాన్స్ లేదు.

## మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు కావాలని
# పెద్ద కొండా మర్రి గ్రామ దేవతకు అభిషేకం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 22:**
పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలం పంచాయితీ కేంద్రమైన కొండమర్రి గ్రామంలో కొలువైనటువంటి గంగమ్మ దేవతకు శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులచే అభిషేకం నిర్వహించారు. రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డికి తొందరగా బెయిల్ రావాలని ఆకాంక్షిస్తూ దేవస్థానంలో వైకాపా మండల అధ్యక్షులు నాగభూషణ రెడ్డి, గ్రామ సర్పంచ్ జయ సుధమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డిని లేని లిక్కర్ కేసులో కావాలనే కక్ష పూరితంగా నిర్బంధించారని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేయాలనే ఈ కేసు బనాయించారని చంద్రబాబు నాయుడు ఎన్ని కేసులు పెట్టిన ఎంత ఇబ్బందులకు గురిచేసిన, వైకాపా తట్టుకొని ప్రజల పక్షాన నిలబడడానికి సిద్ధంగా ఉందని ఆయన అన్నారు ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు అన్ని ప్రజలు గమనిస్తున్నట్లు రాబోవు కాలంలో చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. గంగమ్మ ఆశీర్వాదంతో మిథున్ రెడ్డికి తొందరగా బెయిల్ మంజూరు చేయాలని అమ్మవారిని పూజించి ప్రార్థించి వేడుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొండా మర్రి గ్రామ సర్పంచ్ జయసుధమ్మ , మాజీ యం పీపీ రుక్మిణమ్మ, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ ఉపాధ్యక్షులు కొండా మర్రి యంపిటిసి హస్సేన్ జంగాలపల్లి రమణ, పుదుపట్ల మోహన్ రెడ్డి టానాధర్ నాగరాజా రాంబాణం శ్రీనివాసులు యం పీటీసీ శ్రీరాములు జి ఆర్ ఎస్ రమణ చెంగారెడ్డి పవన్ రాయల్ వెంగళపల్లి శ్రీనివాసులు షంషీర్ కాటిపేరీ రంగ సిమెంట్ మోహన గిరిబాబు శేషాద్రి పలువురు, వైసిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన వైకాపా నాయకులకు కార్యకర్తలకు అల్పాహారం పెద్ద కొండా మర్రి సర్పంచ్ జయసుధమ్మ ఏర్పాటు చేశారు.

# నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం 500/200 యూనిట్ల పట్ల హర్షం.
## ప్రభుత్వంకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించిన నేత కుటుంబం.

**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**
నేతన్నల కోసం ప్రభుత్వం తీసుకున్న ఉచిత విద్యుత్ నిర్ణయం పట్ల నేతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఇందిరానగర్ పంచాయతీలోని త్యాగరాజు పవర్ లూం యూనిట్ ను ఎమ్మెల్యే సందర్శించారు. పవర్ లూం నేతన్న కుటుంబం (గుత్తి మల్లిక-గుత్తి సురేష్ బాబు దంపతులు)తో ఎమ్మెల్యే కోనేటి అదిమూలం స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, వృత్తిలో అనుభవాలు తెలుసుకుని, ముడి సరకులను, ఉత్పత్తిని పరిశీలించారు. ప్రధానమంత్రి రోజ్‌గర్ యోజన(పిఎంఆర్వై)పథకం ద్వారా, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో 1997లో చిన్న తరహా పరిశ్రమ (స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్) త్యాగరాజు పవర్ లూం



యూనిట్ ను ప్రారంభించామని, మా కుటుంబం అంతా నేత వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నామని ఎమ్మెల్యేతో అన్నారు. పవర్‌లూంకు 500 యూనిట్లు, చేనేతకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతించిన నేతన్నలు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసి, శుభానికి చిహ్నం అయిన పసుపు-పచ్చవర్ణ నేత వస్త్రంతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. చేనేతకు 25000 /- ప్రకటించిన ప్రభుత్వం, నేతన్నల సంక్షేమం కోసం ఇలాంటివి మరిన్ని పథకాలు అమలు చేస్తే తమ జీవితాలు మరింత వెలుగులోకి వస్తాయని వారు అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొందు భారతి, పవర్‌లూం పొన్నేరి గోపి, నూతలపాటి శ్రీనివాసులు నాయుడు, భవన నిర్మాణం కార్మిక నాయకుడు కోటి, యుసఫ్ ఆలీ, తెలుగు మహిళ మునిభూషణమ్మ, నీలమ్మ, జయశంకర్‌రెడ్డి, వేణు, పుట్టయ్య, బాలరాజు, సుబ్బయాదవ్,

# పాత్రికేయుల సంక్షేమం నా లక్ష్యం ఎమ్మెల్యే బొజ్జల







**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**
శ్రీకాళహస్తి పాత్రికేయుల సంక్షేమానికి తాను కట్టుబడి ఉన్నానని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. గుర్తుంపు పొందిన పాత్రికేయులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున గౌరవ వేతనాలు అందేలా అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు హామీ ఇచ్చారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీట్‌ది ప్రెస్ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రాంత పాత్రికేయులపై ఎమ్మెల్యే వరాల జల్లును కురిపించారు. ఎన్నికల హామీల్లో భాగంగా పాత్రికేయుల కుటుంబానికి ప్రమాద బీమా పాలసీని మీట్ ది ప్రెస్ కార్యక్రమంలోనే ప్రారంభించారు. మూడు నెలల్లోపు ప్రెస్‌క్లబ్‌కు స్థలాన్ని సమీకరించి శాశ్వత భవనాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు. అర్హత కలిగి ఉండీ ఇప్పటి వరకు ఇంటి స్థలాలు పొందని పాత్రికేయులకు త్వరలోనే పట్టాలతో కూడిన ఇంటి స్థలాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అర్హత ఉన్న పాత్రికేయుల పిల్లలకు ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇప్పించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా గుర్తింపు కలిగిన పాత్రికేయులకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో వీఐపీ పాస్‌లు అదజేయనున్నట్లు చెప్పారు. మంచీ, చెడులను చూపే దర్పణంలా మీడియా ఉండాలని కోరారు. కలిసి ఉంటే కలదు సుఖం అన్న చందాన పాత్రికేయులంతా ఒకే గొడుగు కింద ఉండాలనీ, శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్‌ను రాష్ట్రంలోనే ఓరోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కందేరి కార్తీక్ నాయుడు, గౌరవాధ్యక్షులు వై.చంద్రయ్య, పీఆర్వో ఈశ్వర్, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, తదితర సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

# సామాన్యులకు బలం సమాచార హక్కు చట్టం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**



కుప్పం పట్టణ పరిధిలోని సచివాలయాల నందు శుక్రవారం నాడు సమాచార హక్కుచట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా 9 వ వార్డు పరిధిలోని 2వ సచివాల యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ నేతలు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి నిర్మూలనకు దోహదపడేలా ప్రజలలో చైతన్యం కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, కె.పి.ఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబుల సూచనల మేరకు కుప్పం నియోజకవర్గంలో ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు తెలిపారు. సమాచార హక్కుచట్టం సామాన్యులకు బలంగా నిలుస్తుందని, వారి చేతిలో ఆయుధంలా పనిచేస్తుం దని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం పై అవగాహన పెంచుకొని, సమాజంలో జరిగే అవినీతిపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి నబి, కో ఇన్చార్జి తిరుమగల్, టీడీపీ నేతలు గని, అల్లా బగష్, ఎస్టీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 22:**



మండల కేంద్రమైన చౌడేపల్లిలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నందు బర్త్డే కేక్ కట్ చేసి అందరికీ పెంచి పెట్టారు, అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు రక్తం సేకరించి అందరికీ రక్తదాతగా పేరు గడిచిన చిరంజీవి మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి వీరాభిమాని భూదేవి హోటల్ యజమాని మురళి, జనసేన మండల పార్టీ నాయకుడు చరణ్, రాయల్ నాయకులు జావిద్, కాలేషా ,హేమంత్, కుమార్, శ్రీకాంత్ నరేష్, శేఖర్, చరణ్ ,తేజ చిరంజీవి, పవన్ కళ్యాణ్, అభిమానులు పాల్గొన్నారు.

# ఓంకార ఆశ్రమ మఠం నందు అన్నప్రసాద వివరణ


**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**



శ్రీకాళహస్తి దేవాలయంలో గల ఓంకార ఆశ్రమ మఠము వారి పీఠాదిపతి రామ స్వామి అద్వ ర్యంలో అమావస్యను పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకములు నిర్వ హించి పూజా కార్యక్రమములు ఘనంగా నిర్వహించడం జరిగింది. భూపతి స్వామి,పళనిస్వామి, మురళి, డా.లక్ష్మీ నారాయణ, రమేష్, బాలాజి, మూర్తి వార్ల అద్వర్యంలో అన్నదాన కార్యక్ర మము నిర్వ హించడ మైనది. పట్టణ ప్రజలు పై పూజా కార్యక్రమములో పాల్గొని స్వామివార్ల అనుగ్రహాన్ని పొందారు.

## వినాయక స్వామి విగ్రహాల ఏర్పాటుకు
# అనుమతులు తప్పనిసరి

**ఎస్ ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**



వినాయక చవితి పురస్కరించుకొని గ్రామాల్లో వీధుల్లో రోడ్డు పక్కన ఏర్పాటు చేసే వినాయక స్వామి ప్రతిమ ఏర్పాటుకు పోలీసుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ తెలిపారు. వినాయకస్వామి ప్రతిమ ఏర్పాటుకు నిర్వాహకులు www.gan eshutsav.net ఈ వెబ్సైట్ ద్వారా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలీస్ శాఖ, పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అలాగే వినాయక చవితి నిర్వహించే చోట అల్లర్లు, డిజె సౌండ్, పాట కచేరి, వంటి వాటికి అనుమతులు లేవు వినాయక చవితి ఆధ్యాత్మిక కార్యక్రమం కాబట్టి అందరూ దైవభక్తితో వినాయక చవితి నిర్వహించుకోవాలని ఎస్సై సుమన్ తెలిపారు.

# వీధుల్లో వినాయక ప్రతిమ ప్రతిష్టకు అనుమతులు తప్పనిసరి
## మండపాల వద్ద డీజే మ్యూజిక్ ఏర్పాటు నిషేధం


**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**



అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు అనుమతులు లేకుంటే చర్యలు తప్పవు. వరదయ్యపాలెం ఎస్సై మల్లికార్జున్ హెచ్చరిక. వినాయక చవితిని పురస్కరించుకొని వీధుల్లో వినాయక ప్రతిమ ఏర్పాటుకు పోలీసుశాఖ నుండి అనుమతులు తప్పనిసరి అని వరదయ్యపాలెం ఎస్సై మల్లికార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక ప్రతిమ ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలీస్ శాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందని ఎస్ఐ వివరించారు. అలాగే వినాయక మండపాల వద్ద డిజె మ్యూజిక్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని, ఎవరు డీజే మ్యూజిక్ ను పెట్టేందుకు అనుమతి లేదని ఎస్ఐ వివరించారు. వై నిబంధనలను అతిక్రమి స్తే చట్టప్ర కారం చర్యలు తీసుకో బడుతుందని ఆయన హెచ్చరించారు. వినాయక ప్రతిమలు ఏర్పాటుచేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొంది, డీజే మ్యూజిక్ లేకుండా పండుగను సంతో షంగా జరుపుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని సబ్ ఇన్స్పెక్టర్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అన్నదాత సుఖీభవ తో రైతులకు చేయూత
## 4284 మంది రైతులకు రూ.2.94 కోట్లు ఎమ్మెల్యే చే పంపిణీ.





**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**
ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడి అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు చేయూతనందించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం వరదయ్యాపాలెం, మండల ప్రజా పరిషత్ కార్యాలంలో మండలానికి చెందిన 4284 మంది రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత నగదు క్రింద రూ.2.94 కోట్లు మెగా చెక్కును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. ఇంక ఎవరైనా అర్హులైన లబ్ధిదారులు ఉంటే వారు అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అన్న దాత సుఖీభవ పథకం అమలు ద్వారా కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వంగా మారిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అంతకు ముందు పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్‌ను పరిశీలించిన అనంతరం రైతులు ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు. ఎమ్మెల్యే ఆదిమూలం, అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రమణ్యం, మండల వ్యసాయాధికారి గౌరీ, ఎంపీడిఓ ప్రసాద్, తహసీల్దార్ సుధీర్, విస్తరణ అధికారి ప్రవీణ్, వ్యవసాయ సహాయకులు, మండల అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, రైతు సోదరులు పాల్గొన్నారు.

## ఆరిమానీ గంగమ్మ గుడి నూతన ఈవోగా వెంకటే రాయల్.
# సన్మానించిన పాయకట్టు గ్రామస్తులు..

**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్, ఆగస్ట్ 22:**



ఆరిమానీ గంగమ్మ గుడికి నూతనంగా నియమితులైన ఈవో వెంకట్‌రాయల్‌ని 18 గ్రామాల పాయకట్టు ప్రజల్లో కొంతమంది, ఈరోజు స్వాగత సత్కారం అందించడం జరిగింది. ఇందులో భాగంగా పైనేని మురళి పాల్గొని ఈవోని గుడి అభివృద్ధి శరవేగంగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని రానున్న సంక్రాంతి కంతా అమ్మవారిని గర్భగుడిలో ప్రతిష్టించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం నాయుడు, పైనేని మురళి, రఘుపతి నాయుడు, సిద్దయ్య శెట్టి,హిమాచలపతి రెడ్డి, బాలాజీ, వెంకట్రామయ్య,జలంధర్ నాయుడు, మరియు దేవాలయ సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## రాళ్ళబుదుగురు గ్రామంలో
# విద్యుత్ స్తంభాలు కరెంటు లైన్లను పునరుద్ధరణకొరకు
## అధికారులతో పరిశీలిస్తున్న రెస్కో డైరెక్టర్లు

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 22:**



కుప్పంనియోజకవర్గం కనుమల దొడ్డి నుండి రాళ్ల బూదుగూరు మీదుగా కర్ణాటక బార్డర్ వరకు బీటీ రోడ్డు మరమ్మత్తుల పనుల్లో భాగంగా రాళ్ల బూదుగూరు గ్రామంలో 250 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి రోడ్డుకు ఇరువైపులా ఉన్నవిరిగిన వంగి పోయిన కరెంటు పోల్లు మరియు కరెంటు లైన్లను పునరుద్ధరణకు రెస్కోశాంతిపురం ఏఈ మునిరత్నం, అధికారులతో కుప్పం రేస్కో డైరెక్టర్లు ఎస్ బసవరాజు, చలపతి ఆధ్వర్యంలో పరిశీలించి 18 కొత్త కరెంటు పోల్లను కరెంట్ లైన్‌లను పునరుద్ధరణ చేయనున్నట్లు పనులను త్వరలో ప్రారం భిస్తామని ఈ సందర్భంగా రెస్కో డైరెక్టర్లు తెలిపారు. అలాగే తమకు రెస్కో డైరెక్టర్లు గా పదవ ులను అప్పజెప్పినందున ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు అదేవిధంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పంచాయతీ అధ్యక్షుడు జయరాజు బియ్యం కుమార్ జైవి శ్రీధర్ బిఎస్ఎన్ఎల్ మురళి ఎంఆర్ నారాయణ రమేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా పై అవగాహన కల్పించండి


**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 22:**



అన్నమయ్యజిల్లా పీలేరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రచార విభాగం రాష్ట్రస్థాయి సమావేశం సజ్జల రామకృష్ణా రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర వైఎస్ ఆర్సిపి పార్టీ ప్రచార కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా మండల గ్రామస్థాయి కమిటీలు పూర్తిచేసి మారుమూల ప్రాంతాలతో పాటు కార్యకర్తలకు గాను, నాయకులకు గాను ఏసమస్య ఎదురైనా సోషల్ మీడియా ద్వారా సమా చారం తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు రాజశేఖర్ తోపాటు రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు అనుబంధ సంఘాలు పాల్గొన్నారు.

# వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

**గంగవరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 22:**



పలమనేరునియోజకవర్గ గంగవరం కొత్తపేట స్థానికులు గురువారం సాయంత్రం 6:30గంటల ప్రాంతంలో తెలిపిన సమాచారం మేరకు. కిట్టన్న మిషన్ వెనుక వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. అలాగే గంగవరం పోలీసులకు సమా చారం అందించగా. ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావినుండి పైకి తీయడానికి అగ్నిమాపక శాఖ అధికారులను సంప్రదించారు. బావిలోతు ఎక్కువగా ఉండడం వలన,చీకటి పడడంతో మృతదేహాన్ని తీయడానికి సాధ్యప డలేదని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. మరుసటి రోజు అనగా శుక్రవారం 11 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిపారు. మృతి చెందినవ్యక్తి శ్రీనివాస్ 52 గుర్తించారు. కాదా శ్రీనివాసు ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడా లేదా మరి ఇంకేదైనా కోణం ఉందా అనేది పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143